నిరాశ మిగిల్చిన బడ్జెట్

గొల్లకురుమల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తుందనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరాశే మిగిల్చింది. మా ఆర్థిక ఎదుగుదల కాంగ్రెస్‌కు ఇష్టం లేనట్లున్నది. మా ఓట్లు కావాలె గాని మా బాగోగులు పట్టవా.. రేవంత్‌రెడ్డి మాయమాటలు నమ్మి మోసపోయినం. పెద్ద ఎత్తున హామీలను కుమ్మరించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి.. అందుకుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరపాలని తెలువదా.. గద్దెనెక్కాక మా గొల్లకురుమల గోడు వినిపిస్తలేదా.. బాధలు కనిపిస్తలేవా.. అధికారంలోకి వచ్చాక గొల్లకురుమలను ఆదుకుంటామని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి.. సరిపడా నిధులను ఎందుకు కేటాయించలేదు. కాంగ్రెస్ పాలన ఇలాగే కొనసాగితే గుణపాఠం తప్పదు. కేసీఆర్ పుణ్యమా అని కొంతవరకు ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. డీడీలు కట్టిన వారికి కనీసం న్యాయం చేయాలి.

- నర్సింహులు యాదవ్, జినుగుర్తి, తాండూరు

విద్యారంగంపై నిర్లక్ష్యం..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉండే చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నది. విద్యారంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు విద్యార్థుల శక్తి ఏమిటో చూపిస్తాం. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. అధికారంలోకి వచ్చిన వెంటనే 25 వేలతో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్.. కేవలం 11602 పోస్టులతో డీఎస్సీ నిర్వహించడం, గ్రూప్ 1, 2, 3 పోస్టులు పెంచకపోవడం సరైన విధానం కాదు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. హామీలిచ్చి మోసం చేయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నది. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులతో కాంగ్రెస్ అసమర్థ పాలన బట్టబయలైంది.

- సంతోష్ నాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు

రూ.4వేల పింఛన్ ప్రస్తావనే లేదు..

ఎన్నికల ముందు అమలుకాని హామీలిచ్చి.. గ్యారంటీలంటూ గారడీ మాటలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చినంక ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసింది. ప్రధానంగా పేదలను నిరాశపరిచింది. బడ్జెట్‌లో రూ.4వేల పింఛన్ ప్రస్తావననే లేకపోవడం దురదృష్టకరం. నిరుద్యోగ భృతి ఊసేలేదు. గతంలో కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగింది. పేదల కోసం ఎన్నో సంక్షమ పథకాలకు రూపకల్పన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకున్నది. ఇది మంచి పద్ధతి కాదు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులవి ఒట్టి మాటలు తప్ప.. చేతలు లేవు. ఇప్పటినుంచైనా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్లాలి.

- కొల్లగల్ల భాస్కర్, ఈర్లపల్లి గ్రామం, చేవెళ్ల మండలం

ఘనంగా పోచమ్మ ఫలహారం బండి ఊరేగింపు



పరిగి, జూలై 25: పరిగి పట్టణంలో గురువారం సాయంత్రం పోచమ్మ ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రిప్పు నడపాలని విద్యార్థుల ఆందోళన

బొంరాస్‌పేట, జూలై 25 : మండలంలోని మదన్‌పల్లి నుంచి బొంరాస్‌పేటకు ఉదయం అదనంగా మరో ట్రిప్పు బస్సును నడపాలని విద్యార్థులు గురువారం బురాన్‌పూర్‌లో ఆందోళన చేశారు. మదన్‌పల్లి, మదన్‌పల్లితండా, నర్సానాయక్‌తండా, గట్టెగానితండా, చెరువు ముందలితండా, బురాన్‌పూర్ గ్రామాల నుంచి ప్రతినిత్యం విద్యార్థులు బొంరాస్‌పేటలోని ఉన్నత పాఠశాలకు, పరిగిలోని కళాశాలలకు వెళ్తుంటారు. వీరికోసం పరిగి డిపో అధికారులు ఉదయం, సాయంత్రం ఒక ట్రిప్పు బస్సును నడుపుతున్నారు. ఐతే ఉదయం మదన్‌పల్లి, మదన్‌పల్లి తండాలోనే బస్సు పూర్తిగా నిండిపోయి కిక్కిరిసిపోతుంది. బురాన్‌పూర్‌లో విద్యార్థులు ఎక్కడానికి స్థలం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మదన్‌పల్లి నుంచి తుంకిమెట్లకు వచ్చి మళ్లీ మదన్‌పల్లి వెళ్లి పరిగికి వెళ్లేది. ఇప్పుడు కూడా బస్సును రెండు ట్రిప్పులు నడపాలని విద్యార్థులు గంటసేపు ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి వీలుగా 4.30కు బస్సు నడపాలని విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ

దోమ, జూలై 25 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని కిష్టాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ వైద్య సిబ్బంది 280 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేసినట్లు ప్రధానోపాధ్యాయుడు లాల్యా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల నివారణ మాత్రను వేసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండి మంచి విద్యను అభ్యసిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనలత, అమృత, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టాలి

కస్తూర్బా గాంధీ పాఠశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, జూలై 25 : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎస్‌వో దేవితో కలిసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలను నాటి వాటిని సంరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరుతీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల బోనాలు..



మర్పల్లి, జూలై 25: మండలంలోని బిల్‌కల్ గ్రామంలో గ్రామ దేవతల బోనాలు రెండోరోజు గురువారం కొనసాగాయి. గ్రామ మహిళలు బోనాలను అందంగా అలంకరించి వీధుల వెంబడి డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, ఊరడమ్మ, లక్ష్మమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అందరిని సల్లంగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని కోరుకున్నారు.

విద్యార్థులకు టీకాలు..

మర్పల్లి : సిరిపురంలో పాఠశాలలో విద్యార్థికి సిబ్బందితో వ్యాక్సిన్ వేయిస్తున్న జిల్లా అధికారి పల్వన్ కుమార్

మర్పల్లి, జూలై 25 : పిల్లలకు మెదడు వాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సిరిపురం పాఠశాలలో విద్యార్థులకు మెదడు వాపు నివారణ టీకాలు వేయడం ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు మెదడు వాపు రాకుండా ముందు జాగ్రత్తగా ఈ టీకా లు ఈనెల 25 నుంచి ఆగస్టు 7 వరకు 1-15 ఏండ్ల లోపు పిల్లలకు వేయనున్నట్లు తెలిపారు.. మండలంలో 6645 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ నేహా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేముల్: తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లల్లో మెదడు వాపు(బ్రెయిన్ ఫీవర్) వ్యాధిని నివారించడానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, చిన్నారులకు జేఈ (జపాన్ ఎన్‌సెఫలైటీస్) వ్యాక్సిన్ ఇస్తున్నట్టు పెద్దేముల్ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు తెలిపారు. 'జేఈ వ్యాక్సినేషన్ క్యాంపెయినింగ్'లో భాగంగా గురువారం మండల పరిధిలోని 9 సబ్‌సెంటర్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 1,798 మంది విద్యార్థులకు జేఈ టీకాను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలనొప్పి, వాంతులు, జ్వరం, గందరగోళంగా ఉండటం, మెడ బిగుసుకు పోవడం, మాట్లాడడానికి రాకపోవడం,మూర్ఛ వ్యాధి, పక్షవాతం, కోమా వంటి లక్షణాలు ఉంటాయని, ప్రత్యేకంగా ఈ వ్యాధికి మందులు ఉండవన్నారు. లక్షణాలను బట్టి మందులు ఇస్తుంటారన్నారు. మెదడు వ్యాపు నివారణకు ముందస్తుగా ప్రతి విద్యార్థి తప్పకుండా జేఈ టీకాను వేయించుకోవాలని, ఆ దిశగా విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,యువజన సంఘాల వారు విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ అరుణ కుమారి, ఏఎన్ఎంలు వెంకటమ్మ, వెంకటలక్ష్మీ, ఆశవర్కర్లు అనూష, మల్లీశ్వరీ, పుష్ప, ఇతర వైద్య సిబ్బంది, పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సునీతా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దేముల్ : విద్యార్థినికి జేఈ టీకాను వేస్తున్న వైద్య సిబ్బంది

కులకచర్ల : బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాలలో..

కులకచర్ల : మండల పరిధిలోని బండవెల్కిచర్ల బాలికల ఆశ్రమ పాఠశాల, ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ మాట్లాడుతూ బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాల, కళాశాలలో 520మంది విద్యార్థులకు గాను 440మంది మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేయించినట్లు తెలిపారు. ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో 543 మంది విద్యార్థులకు 280 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ స్వరూపరాణి, యాదమ్మ, ఏఎన్ఎం సుజాత, జంగమ్మ, మంగమ్మ, శ్రీలత, సుజాత, వెంకటమ్మ, జ్యోతిరత్న, గౌరి, భారతమ్మ, హెల్త్‌అసిస్టెంట్ వెంకటయ్య, శ్రీనివాస్, ఆశకార్యకర్తలు పుష్ప, పద్మ, మంజుల, రాధ, అంబుబాయి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భూములు ఆక్రమిస్తే చర్యలు

కులకచర్ల, జూలై 25 : గ్రామ పంచాయతీ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీపీవో సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు ఉన్న స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఇల్లు నిర్మిస్తున్నారనే విషయాన్ని ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయడంతో ఎంపీవో కరీమ్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ప్రజలు అసౌకర్యంగా ఉండే విధంగా చేస్తే చర్యలు తప్పవన్నారు. పంచాయతీ పరిధిలోని భూమిని రక్షించుకునే బాధ్యత గ్రామ పంచాయతీకి ఉందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమిస్తే ముందుగా పంచాయతీ ద్వారా నోటీసులు అందిస్తామని, నోటీసులను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చౌడాపూర్‌లో గంటల కృష్ణయ్య ఇంటి నుంచి గాంధీ విగ్రహం వరకు 24 ఫీట్ల సీసీ రోడ్డు వేయటకు అనుమతి ఉందని రోడ్డును వేసేందుకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రోడ్డుపైన ఇండ్లు నిర్మాణం చేపడుతున్న వారితో మాట్లాడి ఒప్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, పాల నర్సింహులు, సలాం, వెంకటేశ్, శివుడు, అశోక్, శ్రీనివాస్, బందయ్య, యాదయ్య, ఆనంద్‌కుమార్, శరత్, దాసరి యాదయ్య, నరేశ్, శ్రీను పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో సంధ్యారాణి

పరిగి, జూలై 25: విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేశారని జడ్పీహెచ్‌ఎస్ నెం.1 ప్రధానోపాధ్యాయులు గోపాల్ పేర్కొన్నారు. పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యా యురాలు రుక్మిణి, ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌లను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



మర్పల్లి, జూలై 25: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది దవాఖానల్లో చికిత్స చేయించుకున్న బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. బిల్లులు రావడంతో గురువారం మండల కేంద్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్ మండల నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీమోద్దీన్, సొసైటీ వైస్ చైర్మన్ ఫసీయుద్దీన్, సలీం, సురేశ్ కుమార్, పాండు రంగారెడ్డి, కృష్ణారెడ్డి, సర్వేశ్, వడ్ల వెంకటేశం, జాఫర్, నందు ప్రకాశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తట్టేపల్లి పరిశుభ్రం..

నమస్తే ఎఫెక్ట్

పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో జర్నప్ప,ఎంపీవో రతన్ సింగ్

పెద్దేముల్, జూలై 25: మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామ సమ స్యలపై గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన 'పడకేసిన పారిశుధ్యం' కథనానికి మండల అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం తట్టేపల్లి గ్రామాన్ని మండల ఎంపీ డీవో జర్నప్ప, ఎంపీవో రతన్‌సింగ్ సందర్శించి గ్రామ సమ స్యలను తెలుసుకున్నారు.ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పరి సరాలతోపాటు, గ్రామంలోని మురుగు కాల్వలు,ఇండ్ల మధ్య పేరుకుపోయిన కలుపు మొక్కలను,రోడ్లపై నిల్వ ఉన్న నీటి ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్ర పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని పంచాయతీ కార్యదర్శి గోపాల్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు బి.రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేశ్,అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కొడంగల్, జూలై 25: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఉపాధ్యక్షుడు బాలప్ప, కన్వీనర్ మోహన్ తెలిపారు. గురువారం మండలంలోని రావులపల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ మందిరంలో రజకుల సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు, బావుల వద్ద ధోబీఘాట్ల నిర్మాణాలు చేపట్టక పోవడం వల్ల రజకులు కులవృత్తి నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రజక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా బ్యాంకులు రుణాలు అందించాలని, 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వృత్తి దారుడికి పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు వృత్తిదారుడు మరణిస్తే రూ.5లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

రైతు బీమా రెన్యూవల్ కు ఐదు రోజులే గడువు

వికారాబాద్, జూలై 25 : రైతు బీమా రెన్యూవల్‌కు ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మోమిన్‌పేట మండల వ్యవసాయ అధికారి భూపతి జయశంకర్ తెలిపారు. గురువారం మోమిన్‌పేట రైతు వేదికలో రైతు బీమా ఫారాలను వ్యవసాయాధికారులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్ర మంలో మోమిన్ పేట ఏవో పెంటయ్య పాల్గొన్నారు.

తాండూరు డీఎంగా సురేశ్

యాలాల, జూలై25: తాండూరు డిపో మేనేజర్‌గా సురేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎం సమత హైదరాబాద్ దిల్‌సుక్‌నగర్ డిపోకు బదిలీ అయ్యారు. ఉప్పల్ డిపో నుంచి సురేశ్‌కుమార్ బదిలీపై తాండూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

పరిగి, జూలై 25: వారం రోజుల నుంచి తెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వర్షాల వల్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని, అపరిశుభ్ర వాతావరణంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జి.బాలక్రిష్ణారెడ్డి, జిల్లా నాయకులు బి.రాంచందర్, వి.రాముయాదవ్, వి.పెంటయ్యగుప్త, వాణి, నాయకులు కోళ్ల నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

28న కంటి వైద్య శిబిరం

ధారూరు, జూలై 25: శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కేరెళ్లి ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆదివారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కేరెళ్లిలో సాధూరాం కంటి వైద్యశాల హైదరాబాద్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE IN DATE OF BIRTH

I, KAYYAM AMRUTAMMA W/o. KAYYAM VENKAT REDDY, R/o. 2-9, Jeevangi (V), Basheerabad (M), Vikarabad (D), TG hereby inform that in my Passport my Date of Birth mentioned as 05.02.1961, But as per Aadhar Card and PAN Card my Date of Birth mentioned as 01.01.1963. My date of birth as per Aadhar Card, PAN Card is **01.01.1963** is Correct.

LOST

I, K. MANIKYAM S/o. SHIVA SHANKAR R/o. H.No. 8-4, Doma(V), Doma (M), Vikarabad (D), TG have lost my Original Regd Sale Deed Document Bearing **No. 851/2006,** Dt: 17.03.2006, Registered at S.R.O. Pargi while travelling on 18-05-2023, Anybody Found Contact: **9848915040**

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

Telangana Today

FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.

ప్రకటనల విభాగం సెల్: 80966 77655

వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962